క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం అధిక శ్రావణ మాస శుద్ధ ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

చిన్నారులకు చెస్ పోటీలు



చదరంగం ఆడుతున్న చిన్నారులు

అల్లిపురం : వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో 76వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి నరసింహమూర్తి (శ్రీను) తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రంథాలయం ఆధ్వర్యంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ మంగళవారం ఉదయం పతాకావిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం చిన్నారులకు చిత్రలేఖనం, పాటల పోటీలు, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్ ఆటల పోటీలు ఉంటాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో చిన్నారులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

పింగళికి భారతరత్న ఇవ్వాలి



జెండా ఎగురవేస్తున్న రవికుమార్ తదితరులు

మహారాణిపేట : శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మువ్వన్నెల జెండా ఎగురవేశారు. ప్రకృతి చికిత్సాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ మానవ సేవ జాతీయ అవార్డు గ్రహీత, బీజేపీ మెడికల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు. ఆదివారం నుంచి 15వ తేదీ వరకు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఇంటింటా మువ్వన్నెల జెండా ఎగురవేయాలి అన్నారు. పింగళి వెంకయ్య భారత జాతికి ఇచ్చిన గొప్ప కానుక జాతీయ జెండా అన్నారు. ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించాలన్నారు. డాక్టర్ ఎస్. శ్రీ లక్ష్మి, ఎస్. మహేష్, క్షీరాబ్ది ద్యుతి, శ్రీపతి దుర్గ, గేదెల శ్రీహరి, మంగ, రమణ పాల్గొని పింగళికి అంజలి ఘటించారు.

తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యం

బీచ్ రోడ్డు: కనీసం ఆరు నెలల పాటు పిల్లలకు తల్లిపాలు పట్టాలని లోటస్ ఆస్పత్రి చిన్న పిల్లల డాక్టర్ మురళీ సంతోష్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని ఒక హోటల్లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వటం వల్ల పిల్లలతో పాటు తల్లికి కూడా ఆరోగ్యమన్నారు. ఆస్పత్రి డాక్టర్లు దీప్తి, లీలా తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలకు వేళాయె

- 17 నుంచి కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణలక్ష్మి పూజలు
- కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక క్షీరాభిషేకాలు



స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి



సిరులతల్లి కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు జరపనున్నారు. నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజలో సంకల్పం, లక్ష్మీ సహస్రనామాలు, లక్ష్మీ హోమం, అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం చేపట్టనున్నారు. పూజలో పాల్గొనే భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుంది. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు (దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్రయంత్రం (రాగి) మహాప్రసాదంగా అందజేస్తారు.

శ్రావణమాసం..పండగ పర్వదినాలు..

శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం (ఆగస్టు 25) రోజున వరలక్ష్మీవ్రతం, సెప్టెంబర్ 8వ తేదీ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాలు (ఈ నెల 18, 25, సెప్టెంబర్ 1, 8, 15) ప్రత్యేక పూజలు జరపనున్నారు.

17న ప్రారంభం..

స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శ్రావణలక్ష్మీ పూజలు ప్రారంభించనున్నారు. భక్తులు శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలో పాల్గొని అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. స్థానికేతరులు పూజలో పాల్గొనలేనిచో వారి గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటి చిరునామాకు పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

పూజా రుసుం ఎలా చెల్లించాలి..

పూజా రుసుం రూ.400 అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్‌లో చెల్లించాలి. మరిన్ని వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించవచ్చు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాల్లో అమ్మవారి మూల విరాట్‌కు ప్రాతఃకాలంలో ప్రత్యేక క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, వివిధ అమ్మవార్ల స్తోత్రపారాయణం, మహిళలచే సామూహిక శ్రీచక్రసహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. మొదటి శుక్రవారం (18న) అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించనున్నారు. సామూహిక లలితా సహస్రనామ పారాయణం, 108 గోత్ర ఋషి పూజలు నిర్వహించనున్నారు. రెండో శుక్రవారం సువర్ణ వస్త్రాలంకరణ, నవ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు, మూడో శుక్రవారం ముత్యాల చీర అలంకరణ, నవ పుష్పాల పూజ, నాల్గవ శుక్రవారం రజిత వస్త్రాలంకరణ, 108 ద్రవ్యాలతో అమ్మవారి మూలవిరాట్‌కు సహస్ర ఘటాభిషేకం, సామూహిక కుంకుమ పూజలు, ఐదో శుక్రవారం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించనున్నారు.



కన్యకాపరమేశ్వరి అమ్మవారు

శరవేగంగా వన్‌టౌన్ విస్తరణ పనులు



వన్‌టౌన్‌లో దుకాణాలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

జగదాంబ : పాతనగరం విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత కొంత కాలంగా జీవీఎంసీకి, భవన యాజమానులకు మధ్య జరుగుతున్న వాదనలకు కోర్టు ఎట్టకేలకు తెరదించింది. ఇప్పటికే జీవీఎంసీ బ్రిటిష్ కాలం నాటి స్కాట్‌ల్యాండ్ మ్యాప్ ద్వారా రహదారి కొలతలు బయటికి తీసి ఆక్రమణలు తొలగిస్తుంటే, కోర్టుకు వెళ్లిన వ్యాపారులకు చుక్కెదురైంది. దీంతో చేసేదేమీ లేక వ్యాపారులు స్వయంగా జీవీఎంసీకి వచ్చి డాక్యుమెంట్లు సబ్మిట్ చేస్తున్నారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణలో ఉన్నవాటిని తొలగిస్తు, డాక్యుమెంట్లు ఉన్న వారికి టీడీఆర్‌లు ఇస్తున్నారు. దీంతో పాతనగరం రహదారి వెడల్పు పనులు శర వేగంగా జరుగుతున్నాయి.

పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయాలు



సీనియర్ సూపరింటెండెంట్ రాహుల్

జగదాంబ : స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ పతాకాల విక్రయాలు జరుగుతున్నాయని విశాఖపట్నం తపాలా శాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆర్. రాహుల్ ఆదివారం తెలిపారు. దేశ ప్రజల్లో జాతీయ భావం పెంపొందించేందుకు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగ 2.0'కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తపాలా శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ప్రజల్లో అవగాహన నిమిత్తం ఈనెల 11న ఆర్‌కే బీచ్‌లో భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేందుకు తపాలా శాఖలో జాతీయ పతాకాలు అందుబాటులో ఉంచామన్నారు. అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాహుల్ కోరారు.

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం



బంగారుమెట్టలో సీసీ రోడ్లు నిర్మిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు బంగారుమెట్ట ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. వార్డులో రూ.42 లక్షలతో జరుగుతున్న పనుల్లో భాగంగా కాలువలు, సీసీ రోడ్ల పనులు గత శనివారం నుంచి ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో రోడ్లు ఇసుక, పిక్కలతో నిండిపోవటంతో పాదచారులు, స్కూలు పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. వాహన చోదకులు తప్పనిసరి పరిస్థితుల్లో చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని వాపోతున్నారు. బంగారుమెట్ట ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో యూజీడీ పనులు చేపట్టినా ఇంత వరకు కనెక్షన్లు ఇవ్వలేదని, ఆ పనులు పూర్తి చేసి సీసీ రోడ్లు నిర్మిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

అవయవదానాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలి



మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

సీతంపేట: పేదలకు ఉపయోగపడేలా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ప్రపంచ అవయవదాన వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. కేజీహెచ్ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి ఆపరేషన్ల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయాలని, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలన్నారు. అవయవదానం చేసిన వారి పిల్లలకు ప్రోత్సాహకంగా ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. ఉన్నత విద్యా సిలబస్‌లో అవయవదానాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని, ఈ విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు మాట్లాడుతూ అవయవదానంతో ఎంతో మందికి పునర్జన్మనిస్తున్న వారంతా దేవుళ్లతో సమానమన్నారు. అటువంటి కార్యాన్ని పెద్ద ఎత్తున చేస్తున్న గూడూరు మహాలక్ష్మి సేవలను అభినందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ బ్రెయిన్ డెడ్ అయిన వారు అవయవ దానం చేయడం వల్ల వారి నుంచి సేకరించిన గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, ప్రేగులు, ఎముకలు, మూలుగ, కళ్లు మరణానికి చేరువైన వారికి అమర్చడం ద్వారా వారికి జీవితాన్ని ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. అవయవదానానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శరీరదాతలకు అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఏఎంసీ ప్రొఫెసర్ వి.పద్మజ, అనకాపల్లి డీటీవో వి.ఎల్.సుభాషిణి, ట్రస్టు కార్యదర్శి ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ బొమ్మకు ముస్తాబు



అందంగా ముస్తాబయిన అల్లిపురం గాంధీ బొమ్మ

అల్లిపురం : స్వాతంత్య్ర దినోత్సవం వస్తుందంటే చాలు అల్లిపురం గాంధీ బొమ్మ సెంటర్‌లో సందడి మొదలవుతుంది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కడున్న గాంధీ బొమ్మను ముస్తాబు చేస్తున్నారు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో ఆయన కలకత్తా వెళ్తూ మార్గమధ్యలో విశాఖలోని టౌన్‌హాల్లో మీటింగ్ నిర్వహించారు. మీటింగ్ అనంతరం స్థానిక పెద్దల కోరిక మేరకు ఆయన అల్లిపురంలో పాదయాత్ర చేపట్టారు. అందుకు గుర్తుగా ఈ ప్రాంతంలో గాంధీ బొమ్మను ఆయన మరణానంతరం నెలకొల్పారు. అప్పటి నుంచి ఈ ప్రాంతానికి గాంధీ బొమ్మ సెంటర్ అని పేరు వచ్చింది. అల్లిపురానికి చెందిన పెతకంసెట్టి నరసింగరావు అనే వ్యక్తి ఈ ఏడాది గాంధీ బొమ్మకు రంగులు వేయించటంతో గాంధీ బొమ్మ చూడముచ్చటగా కనపడుతోంది. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న పెన్సిల్ స్కెచ్ చిత్రాల ప్రదర్శన




రమణమూర్తిని సత్కరిస్తున్న వైజాగ్ ఫిలిం సొసైటీ సభ్యులు

బీచ్ రోడ్డు: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు పొన్నాడ రమణమూర్తి గీసిన పెన్సిల్ స్కెచ్ చిత్రాల ప్రదర్శనను రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన నగర ప్రజలను ఆకట్టుకుంది. సుమారు 70 రకాల తెలుగు సినిమాల్లో ప్రముఖుల చిత్ర మాలికలను ప్రదర్శించారు. అనంతరం చిత్రకారుడు రమణమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ఎం.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

15న పద్య నాటక ప్రదర్శన

మురళీనగర్: స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా ఈ నెల 15న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం జెండా వందనం అనంతరం సాయంత్రం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాల్లో నంది బహుమతి పురస్కార గ్రహీతలు శ్రీసాయి కళానికేతన్ నటులచే శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్యనాటకం ప్రదర్శిస్తామని తెలిపారు. ప్రజలందరూ ఈ నాటక ప్రదర్శనకు హాజరు కావాలని వారు కోరారు.

ఆకర్షణీయంగా బస్ షెల్టర్



పెదగదిలి కూడలి వద్ద జీవీఎంసీ నిర్మించిన బస్ షెల్టర్

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి కూడలి వద్ద జీవీఎంసీ ఆకర్షణీయంగా బస్ షెల్టర్‌ను నిర్మించింది. ఇక్కడ ఇంత వరకు బస్ షెల్టర్ లేక పోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందిపడేవారు. ఇప్పుడు ఆ సమస్య తీరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లోగోతో బస్ బే పేరుతో నిర్మించిన ఈ షెల్టర్ ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. గ్రానైట్ పలకలతో ఫ్లోరింగ్, బెంచీ ఏర్పాటు చేశారు. డివైడర్‌లో పచ్చదనం నాశనం కాకుండా చెట్ల మధ్యలో ఈ షెల్టరును నిర్మించారు. బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించినప్పటి నుంచి ఇక్కడ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బంది పడ్డామని, ఇప్పుడు ఆ సమస్య తీరిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన నవదిన ప్రార్థనలు

- దేవమాత ప్రధాన ఉత్సవానికి ఏర్పాట్లు



నవదిన ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవ భక్తులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో నవదిన ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్లీవ్ గుర్తువీధిలో దేవమాత ఆలయం వద్ద జపమాల, దివ్య పూజాబలులు నిర్వహించారు. సాయంత్రం మేళ తాళాలతో దేవర ప్రసాదాల మాత అవతారంలో దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీవ్ గుర్తువీధి, రే బరిల్, సిరిల్ మాన్యువల్, డయాస్, నికోలస్ తదితర వీధుల్లో ఊరేగించారు. ఆగస్టు 15న దేవమాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో సుమారు రూ. 50 వేల వ్యయంతో ఈ ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు వై.అమర్‌దీప్, ఆదిరెడ్డి చార్లీ, పి.ఆనందరావు, గురు మండలి సలహా సంఘం సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డాది అప్పలరాజు

దాబాగార్డెన్స్ : విద్యా, ఉద్యోగ, ఉపాధి, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రెల్లి కులస్తులకు ప్రాధాన్యత కల్పించాలని సీనియర్ ఐఆర్ఎస్ అధికారి వడ్డాది అప్పలరాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అంబేడ్కర్ సేవా సంఘం ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయికలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా రెల్లి కులస్తుల నుదుటి రాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించి, రెల్లి జనాభా లెక్కలు తక్కువగా చూపించి అన్యాయం చేశారన్నారు. రెల్లి హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ దలాయ్ ఆడమ్స్ మాట్లాడుతూ రెల్లి కులస్తులు విడిపోకుండా ఐక్యంగా ఓ సంఘం ఏర్పాటు చేసుకుంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు రెల్లీలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. లేనిచో ప్రధాన పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెల్లి కుల ప్రతినిధులు చెన్నా అప్పలరాజు, కస్తూరి వెంకట్రావు, రౌతు అప్పారావు, వి. గురుమూర్తి, రాష్ట్ర రెల్లి మేధావుల సంఘం అధ్యక్షుడు బండి సురేంద్ర, యర్రంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు

దాబాగార్డెన్స్ : ది వైజాగ్ పటం ఫంక్షన్ మెటీరియల్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్-2023-25 కాలానికి ఎన్నుకోబడిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా జి. పురుషోత్తమరావు, అధ్యక్షుడిగా సీహెచ్‌వీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ గిరిధర్, కార్యదర్శిగా బి. సాయిబాబు, సంయుక్త కార్యదర్శులుగా మహ్మద్ యాసిన్ బాబ్జి, డి. నగేష్, ఎస్. చిట్టిబాబు, సురేష్, కోశాధికారిగా కేఎల్ గురునాథ్ ప్రమాణ స్వీకారం చేశారు. అసోసియేషన్ మీడియా ఇన్‌చార్జిగా ఎంవీ రాజశేఖర్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సీహెచ్‌వీ సుబ్బారావు మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతోనే సంస్థ ప్రగతి సాధ్యపడుతుందన్నారు. ప్రతి సభ్యుడు సంస్థ అభివృద్ధికి పూర్తి సహకారమందివ్వాలని కోరారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థి విద్యాభివృద్ధికి రూ. 20 వేల రూపాయల కిసాన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి టెంట్ హౌసెస్ యజమానులు, సభ్యులు పాల్గొన్నారు.

జెండా పండగ సందడి





అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో విక్రయానికి ఉంచిన వివిధ రకాల జెండాలు, స్టిక్కర్లు

- ఎక్కడికక్కడ ప్రత్యేక దుకాణాల ఏర్పాటు
- జోరుగా త్రివర్ణ పతాకాలు, హ్యాండ్ బ్యాండ్లు, స్టిక్కర్ల విక్రయాలు

సీతంపేట: బ్రిటీష్ సంకెళ్ల నుంచి దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిన రోజు ఆగస్ట్ 15. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ జరుపుకునే పండగ స్వాతంత్య్ర దినోత్సవం. ఆరోజున మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేసేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధమవుతారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, పార్టీ కార్యాలయాలు, ఆటో స్టాండ్లు ఇలా ప్రతి చోటా మువ్వన్నెల జెండాను ఎగురవేసి సెల్యూట్ చేస్తుంటారు. జెండా పండక కోసం చాలా మంది త్రివర్ణ పతాకాలు కొనుగోలు చేస్తుంటారు. దీంతో నగరంలో పలుచోట్ల జాతీయ జెండాల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. త్రివర్ణ పతాకాలతోపాటు స్టిక్కర్లు, బాడ్జిలు, రిస్ట్ బ్యాండ్లు, బైకులకు పెట్టే జెండాలు, డెకరేషన్ కోసం దండలు ఇలా సుమారు 21 రకాల వస్తువులను దుకాణాల్లో విక్రయిస్తున్నారు. వినియోగదారుల కొనుగోళ్లతో విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. సీతంపేట, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, పాలబూత్ సెంటర్ తదితర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి జెండాలు, స్టిక్కర్లు జోరుగా విక్రయిస్తున్నారు.

అష్టలక్ష్మి అమ్మవార్లకు విశేష హారతి



హారతి సమర్పిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, మాతా రమ్యానంద భారతి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగంలో భాగంగా ఆదివారం సాయంత్రం అష్టలక్ష్మీ వైభవం అత్యంత ఘనంగా నిర్వహించారు. కుర్తాళ పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ వేద మంత్రాలతో అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అష్టలక్ష్మీ అమ్మవార్లకు హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణ మాసం అధిక మాసంగా వచ్చిందన్నారు. అధిక మాసంలో పూజ, జప, హోమాలూ చేస్తే అధికమైన సత్ఫలితాలు వస్తాయని శ్రీమహావిష్ణువు అధిక మాస ప్రాశస్త్యంలో చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.